సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



తైక్వాండో రాష్ట్ర జట్టు ఎంపిక

రైల్వేకోడూరులో అంతర్ జిల్లా తైక్వాండో పోటీలలో విజయం సాధించిన బాలురు, బాలికలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారద తెలిపారు. -8లో



రైల్వే రన్నింగ్ స్టాఫ్ క్రూను బలోపేతం చేయాలి

నందలూరు రైల్వే క్రూ సెంటర్‌ను బలోపేతం చేయాలని రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరామని ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.820	రూ.880
రెండోరకం	రూ.700	రూ.800

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 98 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	475	550
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 175.160 కిలోలు

న్యూస్‌రీల్

డీఎస్‌డబ్ల్యుఓగా జయప్రకాష్



రాయచోటి అర్బన్: సాంఘిక సంక్షేమశాఖ అన్నమయ్య జిల్లా డీఎస్‌డబ్ల్యుఓగా ఎస్. జయప్రకాష్ నియమితులయ్యారు. పీలేరు సహాయ సంక్షేమాధికారిగా పనిచేస్తున్న జయప్రకాష్‌ను ప్రభుత్వం అన్నమయ్య జిల్లా డీఎస్‌డబ్ల్యుఓ (ఎఫ్ఏసీ)గా నియమించింది. దీంతో శనివారం ఆయన రాయచోటి సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

జిల్లా అటవీశాఖాధికారిగా జగన్నాథం సింగ్

రాజంపేట: జిల్లా అటవీశాఖాధికారిగా జగన్నాథంసింగ్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా అటవీశాఖాధిగారి వివేక్‌ను తిరుపతి జిల్లా అటవీశాఖాధికారిగా బదిలీ చేశారు. కాగా ఇక్కడికి డీఎఫ్ఓగా వస్తున్న సింగ్ అనకాపల్లి నుంచి వస్తున్నారు. సాధారణ బదిలీలలో భాగంగా ఈయన ఇక్కడికి బదిలీ అయ్యారని అటవీ వర్గాలు తెలిపాయి.

ఈ-పంట నమోదు పరిశీలించిన కలెక్టర్



ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: వ్యవసాయ అధికారులు, సిబ్బంది చేస్తున్న ఈ-పంట నమోదు వివరాలను జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పరిశీలించారు. శనివారం రాయచోటి మండలం, అబ్బవరం గ్రామంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ-పంట నమోదు వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ కు ఈ-పంట కార్యక్రమంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శ్రీలత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెండో వంద రోజుల ప్రణాళికను రూపొందించండి

రాయచోటి: జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు రెండవ వంద రోజుల ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెండవ వంద రోజుల ప్రణాళికకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్య, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, గృహ నిర్మాణ, డీపీఓ, సీపీఓ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, లేబర్, టూరిజం శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలకు, 2047 నాటికి జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలు డాక్యుమెంటరీ సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చక్రాల మడుగు.. అక్రమాలే అడుగడుగు!

రాజంపేట నడిబొడ్డున ఉన్న చక్రాల మడుగుపై కబ్జారాయుళ్ల కన్నుపడింది. ఇంకేముంది ఆక్రమణ పర్వానికి తెరలేపారు. ఎంతగా అంటే.. వీఆర్వోలు, సర్వేయర్లను రంగంలోకి దింపి బ్రిటీష్ కాలం నాటి మడుగు మ్యాప్‌ను మార్చేలా స్కెచ్ వేశారు. ఎంచక్కా ఇతర ప్రాంతాల నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. రెండు దశాబ్దాలుగా మడుగును క్రమక్రమంగా కబ్జా చేస్తూ వస్తున్నారు. ఈ వ్యవహారంలో ఏకంగా రూ. 300 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయంటే కబ్జా పర్వం ఏస్థాయిలో జరిగిందో తెలుసుకోవచ్చు.

- కబ్జాల పర్వంలో రూ.300 కోట్ల లావాదేవీలు
- రాజంపేట రెవిన్యూలో 'అవినీతి మడుగు'
- ఆక్రమణ దందాలో టీడీపీ నేతల హస్తం



మడుగులో మట్టిపోసి చదును చేసిన ప్రాంతం (ఇన్‌సెట్) మడుగు స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలు

రాజంపేట: రాజంపేట పట్టణ నడిబొడ్డున ఉన్న చక్రాలమడుగు కబ్జాకు గురవుతోంది. కోట్లాది రూపాయల విలువ చేసే మడుగు స్థలాన్ని రెండు దశాబ్దాలుగా క్రమక్రమంగా కబ్జారాయుళ్లు ఆక్రమించుకుంటున్నారు. దీనికి కేంద్ర బిందువు తహసీల్దారు కార్యాలయమే అనే విమర్శలు వినవస్తున్నాయి. కబ్జా పరంపరలో రూ.300 కోట్లు లావాదేవీలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై సీబీఐ విచారణ చేపట్టాలన్న డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది. మడుగులో ఇతర ప్రాంతాల నంబర్లతో దర్జాగా రిజిస్ట్రేషన్లు చేయించడంలో ఓ మాజీ వీఆర్ఓ కీలకపాత్ర పోషించారనేది అందరికీ తెలిసిందే.

మడుగు ఆక్రమణలో టీడీపీ నేతలదే అగ్రస్థానం

చక్రాలమడుగు ఆక్రమణలో టీడీపీ నేతలదే అగ్రస్థానమని పట్టణ వాసులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. మడుగును ఆనుకుని ఎస్సీల పేరుతో రూములు కూడా వేసుకున్నారు. అధికారంలో టీడీపీ ఉంటే మడుగులో ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతుంది. ఇప్పటికీ కూడా అదే పరంపర కొనసాగుతోంది. సీఎం చంద్రబాబు సామాజిక వర్గమే మడుగు స్థలాలపై పెత్తనం చేస్తున్నారు.

గత సర్వేలన్నీ గాలికే..

కలెక్టర్ నుంచి తహసీల్దారు వరకు మడుగు ఆక్రమణలపై అనేక మార్లు సర్వేలు, మార్కింగ్ చేసినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి. మడుగు స్థలంలో మేడలు, మిద్దెలు వెలిశాయి. ఇటీవల మున్సిపాలిటీ శాఖ మంత్రి నారాయణ రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు, కుంటలు, మడుగులను కబ్జా నుంచి విముక్తి కల్పించేందుకు ఆపరేషన్ బుడమేరు చేస్తామని ప్రకటించారు. ఆపరేషన్ బుడమేరు చక్రాలమడుగుకు వర్తిస్తుందా..అధికారపార్టీ వారే కదా అని గుడ్‌బై చెబుతారా .. అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఆర్ఎస్ఆర్ ప్రకారం పొరంబోకు స్థలాలు

చక్రాలమడుగు పరిధిలో ఆర్ఎస్ఆర్ ప్రకారం పొరంబోకు స్థలాలుగా గుర్తింపబడి ఉంది. ఈవిషయాన్ని రెవిన్యూ అధికారులు ధృవీకరిస్తున్నారు. సర్వేనెంబరు 961లో ఎ, బీ, డీ పరిధిలో ఉన్న నిర్మాణాలు 150 నుంచి 200లోపు ఉన్నట్లుగా రెవిన్యూ సిబ్బంది గుర్తించినట్లు సమాచారం. చాలావరకు ఈ నిర్మాణాల క్రమబద్ధీకరణ జరిగిపోవడం, రిజిస్ట్రేషన్ కావడం, చేతులు మారిపోవడం లాంటివి ఎప్పటి నుంచో జరుగుతున్న తంతు. రెవిన్యూ శాఖ అనేకమార్లు సర్వే నిర్వహించినా ఫలితం లేకపోయింది. రామ్‌నగర్ ఏరియా, రైల్వేకోడూరు రహదారి, పాతబస్టాండు రహదారి తదితర ప్రాంతాల్లో మడుగు సర్వే నిర్వహించారు. 25 ఎకరాలు చక్రాలమడుగు ఇప్పుడు ఆరు ఎకరాలకే పరిమితమైందన్న వాదన వినిపిస్తోంది.

మడుగు స్వరూపం గల్లంతు

చక్రాలమడుగు స్వరూపానికి సంబంధించిన ఆధారాలు తహసీల్దారు కార్యాలయంలో గల్లంతయ్యాయి. బ్రిటీషు కాలంనాటి మడుగు అసలు మ్యాప్ రాజంపేటలో కీలకంగా ఉన్న ఓ సర్వేయర్ మార్చేశారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆక్రమణదారులకు అనుకూలంగా మడుగు మ్యాప్‌లు సృష్టించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మడుగు ఆక్రమణ విషయంలో కీలకంగా వ్యవహరించిన వీఆర్ఓలు, సర్వేయర్లు కోట్లకు పడగలెత్తారంటే ఆర్థిక లావాదేవీలు ఎంత ప్రభావితం చేశాయో అర్థం చేసుకోవచ్చు.


ఆక్రమణలపై విచారణ చేపట్టాలి



చక్రాలమడుగు కబ్జాపై విచారణ చేపట్టాలి. వరదలు వస్తే పట్టణానికి మునకతప్పదు. మడుగు స్థలాలు ఆక్రమణదారుల చేతిలోకి ఇప్పటికే వెళ్లిపోయాయి. కంటితుడుపుగా అప్పుడప్పుడు రెవిన్యూశాఖ సర్వేలు చేస్తోంది. అసలు మడుగు స్వరూపమెంత అనేది తేలాలి. - మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి, సీపీఐ, రాజంపేట

మడుగు హద్దులు నిర్ణయిస్తే ఆక్రమణల తొలిగింపు తథ్యం

చక్రాలమడుగు హద్దులను రెవిన్యూ శాఖ నిర్ణయిస్తే, ఆక్రమణలు తొలిగింపు తథ్యం. ఇప్పటికే డీఈ నుంచి తహసీల్దారుకు హద్దులు తెలియజేయాలని లేఖ రాశారు. అసలు మడుగు స్వరూపం బయటపడాలి. అంటే బ్రిటిషుకాలం నుంచి ఉన్న రికార్డుల ఆధారంగా తెలుస్తుంది. మడుగు కబ్జా గురించి రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమా నైదియా చర్చించారు. రెవిన్యూశాఖ మడుగులో మార్కింగ్ ఇవ్వగలిగితే నీటిపారుదలశాఖ ముందుకెళుతుంది. - వెంకట్రామయ్య, ఎస్ఈ, నీటిపారుదలశాఖ, కడప



కడపలో లలితా జ్యువెల్లరీ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న వ్యవస్థాపకుడు కిరణ్ కుమార్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి

కడప కార్పొరేషన్: తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన లలితా జ్యూవెల్లరీ 56వ షోరూం కడపలో శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి లలితా జ్యూవెల్లరీ వ్యవస్థాపకుడు కిరణ్‌కుమార్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి పూజలు నిర్వహించారు.

నవంబర్‌లో పెద్దదర్గా ఉరుసు



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్,



ఉరుసు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు,అతిథులు

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప కల్చరల్: కడపలోని పెద్ద దర్గా వార్షిక ఉరుసు ఉత్సవాలను నవంబరు 15వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ అధ్యక్షతన శనివారం ఉరుసు వివరాల పోస్టర్‌ను కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉరుసు నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ప్రాథమిక అవసరాలైన నీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ ఉరుసును విజయవంతం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, పలు పార్టీల నేతలు మాసీమబాబు, అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, సుభాన్ బాషా, అఫ్జల్‌ఖాన్, సుంకర శ్రీనివాస్ వివిధ శాఖల ఉన్నతాధికారులు మాట్లాడారు. అంతకుముందు కలెక్టర్ దర్గాలోని ప్రధాన గురువుల మజార్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.

ఉరుసు వివరాలు

- నవంబరు 11న నషాన్ ఉత్సవం
- 15న ఉత్సవాలు ప్రారంభం
- 16న గంధం
- 17న ఉరుసు
- 18న తహలీల్ ఫాతెహా, ముషాయిరా
- 19న ఖవ్వాలీ కచేరి
- 20న పీఠాధిపతి ఊరేగింపు
- 21న ముగింపు కార్యక్రమాలు



అమ్మవు నీవే.. అఖిల జగాలకు!



అమ్మవారిశాలలో శారదాదేవి అలంకారం

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో దేవీ ఆలయాలు కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా దసరా ఉత్సవాలకు పేరుగాంచిన ప్రొద్దుటూరు పట్టణంలో వేడుకలు కన్నులపండువగా సాగుతున్నాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ దేవతా రూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చెన్నకేశవస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మిదేవి, శివాలయంలో, సూపర్ బజార్ రోడ్డులోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవి భక్తులను అనుగ్రహించారు. అలాగే జిల్లాలోని కడప విజయదుర్గాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. - ప్రొద్దుటూరు కల్చరల్



అమ్మవారిశాలలో క్యూలో ఉన్న భక్తులు



అమ్మవారి శాలలో శారదాదేవిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

బి.కొత్తకోట : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్టు సీఐ రాజారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..మదనపల్లె బాలాజీ కాలనీకి చెందిన చాంద్‌బాషా (27) గతనెల 15న బి.కొత్తకోట మండలం కనికలతోపు వైపు నుంచి మదనపల్లెకు బైక్‌పై వెళ్తున్నాడు. ఎర్రమద్దువారిపల్లె వద్దకు రాగానే ఎదురుగా మదనపల్లె వైపు వెళ్తున్న ఆటోను బైక్‌పై వెళ్తున్న చాంద్‌బాషా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చాంద్‌బాషాకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరిగి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఇక్కడి నుంచి తిరుపతి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చింతపర్తి వద్ద మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

సంబేపల్లె : మద్యం తాగి ఆటో నడిపినందుకు వెంకటరమణ అనే వ్యక్తికి ఒక నెలపాటు జైలు శిక్ష విధించినట్లు సంబేపల్లె పోలీసులు తెలిపారు. ఇటీవల వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి ఆటో నడుపుతున్న వ్యక్తిపై సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. జిల్లా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆసిఫా సుల్తానా నిందితుడికి ఈమేరకు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రాయచోటి పట్టణంలో తొమ్మిది మందికి జరిమానా

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో తొమ్మిది మందికి రాయచోటి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆసీఫా సుల్తానా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న బాడేపల్లె సతీష్‌రెడ్డి, ఆవులకుంట రెడ్డెయ్య, షేక్ సిరాజ్, జగిలిరమేష్, చిట్టిబోయిన ఆంజనేయులు, పసల రామాంజులు, టి.రామమోహన్‌రెడ్డి, పి.భార్గవ్, కె.బాలకృష్ణ, జి.నవీన్‌లు ఒక్కొక్కరికి రూ.10,500 జరిమానా విధించారని తెలిపారు.

కార్యాచరణ.. విజ్ఞాన బాట

ప్రణాళికతో సెలవుల్లో వెలుగులు



మదనపల్లె సిటీ : సమయం వెలకట్టలేనిది. ప్రతి క్షణం ఉన్నతులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుంది. విద్యా సంస్థలకు ఈ నెల 3వతేదీ నుంచి 13 వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. 12 రోజుల పాటు ఇచ్చిన పండుగ సెలవులను వినోదంతో విజ్ఞాన మయంగా మార్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం..

ఫోన్లకు దూరం

విద్యా సంస్థలు కొనసాగినన్ని రోజులు విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువు, హోం వర్కు, సన్నద్ధతతో హడావిడిగా గడిపారు. కాస్త సమయం దొరికితే స్మార్ట్ ఫోన్ చూసేవారు. ప్రస్తుతం సెలవుల్లో అపరిమితంగా అవకాశం ఇవ్వొద్దు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కొందరు గంటలకొద్ది చూస్తుంటారు. వారిని కాస్త కట్టడి చేయాలి. ఇతర అంశాలపై దృష్టి మరల్చాలి.

గౌరవం పెంచుదాం..

సెలవుల్లో కుటుంబ సభ్యులు తమ నేపథ్యాన్ని చెప్పాలి. ఎంత కష్టపడితే ఈ స్థాయికి చేరామనే విషయాన్ని వివరించాలి. పరస్పరం గౌరవించే విధానం అలవర్చాలి. ఊర్లకు పంపిస్తారు కనుక పెద్దలను గౌరవించడం నేర్పించాలి. రోజులో కొంత సమయాన్ని కేటాయించాలి. కలిసి భోజనం చేయడం, సరదాగా, స్నేహపూర్వక వాతావరణంలో మెలుగుతూ ..హిత వచనాలు వల్లె వేయాలి.

ప్రోత్సాహంతో ఉత్సాహం..

పిల్లలకు ఆసక్తిగల ఆటపాటలతో పాటు నచ్చిన కళల వైపు ప్రేరేపించేందుకు మంచి సమయంగా భావించాలి. చిత్రలేఖనం, శాస్త్రీయ , జానపద నృత్యం, సంగీతం , వాయిద్యం ఇతర అంశాలను నేర్చుకునే అవకాశం కల్పించవచ్చు. ఫలితంగా పట్టు సాధించవచ్చు.

పుస్తకం వైపు మరలేలా..

మారుతున్న పరిస్థితుల్లో పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. ఆన్‌లైన్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా ఎనలేని విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఇక్కడ చదివిన ఎంతో మంది గొప్ప వ్యక్తులుగా ఎదిగారు. ఈ క్రమంలో జిల్లాలో ఉండే గ్రంథాలయాలను వినియోగించుకోవచ్చు. పుస్తకాలు, డిక్షనరీలు, పత్రికలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలి.

సంస్కృతిని నేర్పించాలి

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల ప్రభావం ఎంతో ఉండేది. చిన్నా,పెద్ద అంతా కలిసి ఉండేవారు. సెలవుల్లో అమ్మమ్మ, నాయనమ్మ ఇళ్లకు వెళ్లడం పరిపాటి. ఇదే అదునుగా సెలవులను సంస్కృతి, సంప్రదాయాలకు తెలియజేసే వేదికగా మార్చుకోవాలి. పండుగ విశిష్టతను తెలియజేయాలి.

చెంతనే పర్యాటకం

కొందరు దర్శనీయ ప్రాంతాలకు సుదూరం వెళ్తుంటారు. కాస్త ఉపాయంగా ఆలోచిస్తే చెంతనే పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. కర్నాటకలోని మైసూర్‌లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. జిల్లాలో హార్సిలీహిల్స్, నందలూరు, వైఎస్సార్ జిల్లాలోని పుష్పగిరి ఆలయంతోపాటు ప్రొద్దుటూరు అమ్మవారి దసరా ఉత్సవాలు, తిరుపతి సమీపంలోని చంద్రగిరి, తిరుమల బ్రహ్మోత్సవాలు తిలకించవచ్చు. ఆయా చోట్లకు వెళ్తే వినోదం, విజ్ఞానం పంచేందుకు దోహదం చేసినట్లే.

సామాజిక అవసరాల ప్రాముఖ్యతను వివరించాలి



పిల్లలకు సామాజిక సంబంధాల అవసరాన్ని, ప్రాముఖ్యతను తెలియజేయాలి. సెల్‌ఫోన్ యుగంలో అనుబంధాలకు పిల్లలు దూరం కాకుండా తల్లిదండ్రులు వారికి తప్పనిసరిగా సమయం కేటాయించాలి. సెలవుల్లో విహారయాత్రలకు వెళ్లడం వల్ల వారిలో ఉల్లాసం, ఉత్సాహం పెరుగుతుంది.

\- మోహన్‌వల్లి, అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, మదనపల్లె

నందలూరు రైల్వే రన్నింగ్ స్టాఫ్ క్రూను బలోపేతం చేయాలి

- కృష్ణపట్నం లైనులో ప్యాసింజర్ రైళ్లను నడపాలి
- కరోనా ముందున్న హాల్టింగ్స్‌ను పునరుద్ధరించాలి
- కడప-బెంగళూరు రైల్వేలైన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి



రైల్వేజోన్ సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి

రాజంపేట : గుత్తి–రేణిగుంట డబుల్‌లైను మార్గంలో బ్రిటీషు కాలం నాటి నందలూరు రైల్వే రన్నింగ్ స్టాఫ్ క్రూ సెంటర్‌ను బలోపేతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరామని రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం విజయవాడలో జరిగిన జోనల్ రైల్వే డెవలప్‌మెంట్ సమావేశంలో పాల్గొని, తన పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ప్రయాణికుల సమస్యలను, స్టేషన్ల అభివృద్ధి, కొత్తరైళ్లు, హాల్టింగ్స్ తదితర అంశాలపై నివేదిక రూపంలో అందజేశానన్నారు. తన పార్లమెంటరీ నియోజకవర్గంలో అతిపెద్ద రైల్వే కేంద్రమైన నందలూరు పూర్వ వైభవానికి అనేక మార్లు ప్రతిపాదనలు, వినతులు కేంద్ర ప్రభుత్వానికి అందజేశామన్నారు. నందలూరులో ప్రత్యామ్నాయ రైల్వేపరిశ్రమ, పలురైళ్లకు వాటరింగ్ లాంటి ఏర్పాటుకు అనుకూలమని వివరించానన్నారు. బ్రిటీషు కాలం నుంచి కొనసాగుతున్న రన్నింగ్ స్టాఫ్ క్రూను తరలించడం కానీ, ఎత్తివేయడం కానీ చేయరాదని మరింతగా బలోపేతం చేయాలన్నారు. అవసరమైతే పలు రైళ్లకు క్రూను నందలూరులో తిరిగి కొనసాగేలా చర్యలు తీసుకునేలా కోరామన్నారు. అందుకు తగ్గట్టుగా మోడరన్ రన్నింగ్ స్టాఫ్‌ను నిర్మించాలని, బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయింపు జరిగిందని గుర్తుచేశారు.

కరోనా ముందునాటి హాల్టింగ్స్‌ను పునరుద్ధరించాలి

నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు స్టేషన్లలో కరోనా ముందు ఏ విధంగా రైళ్లకు హాల్టింగ్ కొనసాగిందో అదే విధంగా హాల్టింగ్స్‌ను పునరుద్ధరించాలని జీఎంకు తెలిపానన్నారు. ప్రత్యేకించి నందలూరులో రైళ్లకు హాల్టింగ్ ఇవ్వకపోవడం వల్ల ప్రయాణికులేకాదు, రన్నింగ్ స్టాఫ్ లోకో పైలెట్స్, గార్డులు, కార్మికులు, అధికారులు, ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికులు, కార్మిక కుటుంబాలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

కృష్ణపట్నం లైనులో ప్యాసింజర్ రైలును నడపాలి

ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైల్వేలైను కేవలం సరుకుల రవాణాకే పరిమితమైందని, లైను అందుబాటులోకి వచ్చినా ఇంతవరకు ప్రజారవాణాకు సంబంధించి ఒక్క రైలును కూడా నడిపించలేదని ఎంపీ తెలిపారు. ఈ మేరకు విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ప్యాసింజర్ రైలు ప్రవేశపెట్టే ప్రతిపాదన చేయాలని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ ఆలయాలైన ఒంటిమిట్ట రామాలయం, తెలంగాణాలో భద్రాచలాన్ని కలుపుతూ తిరుపతి నుంచి రాజంపేట, నందలూరు, కడప మీదుగా ఎక్స్‌ప్రెస్ రైలును నడిపించే ప్రతిపాదనను రైల్వే యాజమాన్యం పరిశీలించాలన్నారు. కడప–బెంగళూరు రైలుమార్గం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరినట్లు ఎంపీ వెల్లడించారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని మైసూరువారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద కోడూరు మండలానికి చెందిన దండు సైలు, తోకంచి హరీష్‌లు గంజాయి తరలిస్తుండగా సీఐ హేమసుందర్ రావు, ఎస్‌ఐ నవీన్ బాబు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి కేజీ గంజాయి, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలోని మామిడికాయల మార్కెట్ యార్డు వద్ద రాజంపేట మండలం బోయనపల్లికి చెందిన కూల్ డ్రింక్స్ షాపు యజమాని తోడేటి శేఖర్‌ను అరెస్టు చేసి ఒక కేజీ, రెండు వందల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోడూరు కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారు.

టీడీపీ నాయకుడు కొండ్రెడ్డి అరెస్టు

రెవెన్యూ అధికారులను దుర్భాషలాడిన ఘటన



కొండ్రెడ్డి (ఫైల్)

తంబళ్లపల్లె : రెవెన్యూ అధికారులను దుర్భాషలాడిన ఘటనలో టీడీపీ నాయకుడు ఎం.కొండ్రెడ్డిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. తహసీల్దార్, పోలీసుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని దిగువపాళెం పంచాయతీ అన్నగారిపల్లెలో సర్వే నంబర్.51/1లో 45 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. అందులో పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం భవనాలు ఉన్నాయి. మిగిలిన స్థలంలో కొంతకాలంగా స్థానికులు కొందరు గొర్రెలదొడ్లు, పేడ దిబ్బలు వేసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు ఆ స్థలంలో ఉన్న గొర్రెల దొడ్డి, పేడదిబ్బలను గ్రామస్తులందరి అనుమతితో, వారి సహకారంతో తొలగించి శుభ్రం చేశారు. ఈ క్రమంలో మళ్లీ కొందరు ఆక్రమణదారులు అందులో గొర్రెలదొడ్లు, పేడదిబ్బలు వేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయమై తంబళ్లపల్లె పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ స్థలాలను కాపాడటం రెవెన్యూ ఉద్యోగుల బాధ్యతని, దీనిపై వెంటనే సర్వే చేయించి ప్రభుత్వ స్థలమైతే స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్ హరికుమార్‌ను ఆదేశించారు. దీనిపై శుక్రవారం సర్వేయర్ మహేష్, ఇన్‌చార్జి వీఆర్‌ఓ రమణ సిబ్బందితో అన్నగారిపల్లెకు వెళ్లారు. ప్రభుత్వ స్థలానికి హద్దులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. ఆక్రమణదారులు వారిని అడ్డుకున్నారు. నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. విషయాన్ని ములకలచెరువు సీఐ రాజారమేష్ దృష్టికి తీసుకెళ్లారు. సీఐ అక్కడకు చేరుకుని నిరసన కారులతో చర్చించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులను అడ్డుకోకూడదని, ఏదైనా చెప్పాలనుకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో నిరసన విరమించారు. రెవెన్యూ అధికారులు హద్దులను ఏర్పాటు చేస్తుండగా, అక్కడకు వెళ్లిన టీడీపీ నాయకులు ఎం.కొండ్రెడ్డి, ఆక్రమణదారులకు మద్దతుగా రెవెన్యూ అధికారులను నిర్లక్ష్య ధోరణితో దుర్భాషలాడాడు. ఫోన్‌లో తహసీల్దార్ హరికుమార్‌ను ఏకవచనంతో దుర్భాషలాడాడు. దీనిపై తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కొండ్రెడ్డితో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ములకలచెరువు సీఐ రాజారమేష్, ఎస్‌ఐ గాయత్రిలు తంబళ్లపల్లెలో స్వగృహంలో ఉన్న కొండ్రెడ్డిని శనివారం ఉదయం అరెస్ట్ చేసి, మదనపల్లెకు తరలించారు.



టీడీపీ నాయకుడిని విడిచిపెట్టాలని పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్తత

టీడీపీ నాయకుడు కొండ్రెడ్డిని తంబళ్లపల్లెలో అరెస్ట్ చేసి, మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారన్న విషయం తెలుసుకున్న ఆయన అనుచరులు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కొండ్రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని, ఆయనను విడిచిపెట్టాల్సిందిగా నిరసన తెలిపారు. దీంతో పోలీసులు కొండ్రెడ్డిని తిరిగి తంబళ్లపల్లె స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ర్యాగింగ్‌కు పాల్పడడం నేరం

జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి అర్బన్ : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి కేసులు నమోదు చేయించుకోవడం ద్వారా తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు విద్యార్థులకు హితబోధ చేశారు. స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ర్యాగింగ్, మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సీనియర్లు జూనియర్ విద్యార్థులతో స్నేహ భావంతో మెలుగుతూ కళాశాలలో ర్యాగింగ్ రహిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి కేసులు నమోదైతే విద్యార్థులు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమవుతారన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా, పొగాకు, ఆల్కహాల్ సేవనం వలన అనేక దుష్ప్రభావాలకు లోనవుతారన్నారు. రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్.కృష్ణమోహన్ మాట్లాడుతూ ర్యాగింగ్, మత్తుపదార్థాల సేవనంపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి, రాయచోటి అర్బన్, రూరల్ సీఐలు చంద్రశేఖర్, వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి కరుణాకర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ యుగంధర్

పీలేరు రూరల్ : ఇన్నోవా కారుతో సహా నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు. శనివారం ఉదయం మండలంలోని కావలిపల్లె పంచాయతీ పొంతలచెరువు క్రాస్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. రాయచోటి నుంచి పీలేరు వైపు వేగంగా వెళుతున్న ఇన్నోవాను ఆపారు. డ్రైవర్ కొంతదూరం వేగంగా ముందుకు వెళ్లి చెరువు కట్టపై వాహనాన్ని ఆపి పరారయ్యాడు. వెంబడించిన పోలీసులు వాహనాన్ని చుట్టుముట్టగా తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన అప్పస్వామి సామికన్నును అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని పరిశీలించారు. 118 కేజీలు బరువు గల నాలుగు ఎర్రచందనం దుంగలు, వాహనం, ఒక సెల్‌ఫోన్ రూ. 1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇన్నోవాతోపాటు ఎర్రచందనం విలువ రూ. 12.13 లక్షలు చేస్తుందని వివరించారు. ఈ దాడిలో ఎస్‌ఐ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాల, బాలికల తైక్వాండో రాష్ట్ర జట్టు ఎంపిక

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 68 వ అంతర్ జిల్లా తైక్వాండో పోటీలలో విజయం సాధించిన బాలురు, బాలికలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారద తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎంపిక చేసిన ఇరు జట్లు డిసెంబర్ రెండవ వారంలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీలలో మన రాష్ట్రం తరపున ఆడతాయన్నారు. బాలికల జట్టుకు అనంతపురం జిల్లా నుంచి క్రిష్ణమ్మ, కీర్తన, విజయనగరం నుంచి ఏవంగిని, రేణుక, హిమశ్రీ, ధనుశ్రీ, కడప నుంచి వైష్ణవి, తేజస్విని, హారిక, విశాఖపట్టణం నుంచి పూజిత, కృష్ణా నుంచి భవిష్య ఎంపికయ్యారు. అలాగే బాలుర జట్టుకు విజయనగరం నుంచి చందు, అఖిల్, రోహిత్‌కుమార్, శ్రీకాకుళం నుంచి రాజ్‌కుమార్, వెంకటప్రీతం, చిత్తూరు జిల్లా నుంచి సాహిల్, సాయిదేవేందర్‌రావు, తిరులోచన్‌రెడ్డి, అనంతపురం నుంచి లిఖిత్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా నుంచి తొమ్మ జగన్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. స్టేట్ రెఫరీ రవిశంకర్‌రాజు పోటీలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌ప్రసాద్‌రెడ్డి, పరిశీలకులు శ్రీనివాసులు, అరుణకుమారి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మదనపల్లె : పుంగనూరు మండలం కృష్ణాపురానికి చెందిన రవీంద్ర (48), గుర్రంకొండ మండలం నడిమి కండ్రిగ పంచాయతీ పేయలవాండ్ల పల్లికి చెందిన తన అల్లుడు చక్రవర్తి(35)తో కలసి ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళ్తుండగా, చెర్లోపల్లె వద్ద అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడ్డారు.

రిపోర్టర్‌పై జయచంద్రారెడ్డి అనుచరుల దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: గుర్రంకొండకు చెందిన జీ9 న్యూస్ చానల్ విలేకరి రమేష్‌కుమార్‌పై శనివారం టీడీపీ నేత జయచంద్రారెడ్డి అనుచరులు దాడి చేశారు. ములకలచెరువులో టీడీపీ నేత కొండ్రెడ్డికి సంబంధించి న్యూస్ కవరేజ్ చేసుకొని మదనపల్లెకు బయల్దేరాడు. మార్గమధ్యంలో కదిరినాథుని కోట క్రాస్ వద్ద టీడీపీ నేత జయచంద్రారెడ్డి అనుచరుడు శివకుమార్, మరో ఐదుగురు ద్విచక్రవాహనాల్లో వచ్చి అడ్డగించి విచక్షణారహితంగా దాడి చేశారు. అతని వద్ద ఉన్న కెమెరా, ట్యాబ్, మొబైల్ ఫోను, లోగోను లాక్కెళ్లారు. వీటి విలువ రూ. 4 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థిని మృతి

- తమ్ముడి బర్త్‌డే కోసం వెళుతూ ప్రమాదం
- ప్రమాదంలో తమ్ముడికి గాయాలు



రోడ్డుప్రమాదంలో మృతి చెందిన మేఘన



మేఘన(ఫైల్)

గుర్రంకొండ : తమ్ముడి బర్త్‌డే జరుపుకునేందుకు కేక్ కోసం గుర్రంకొండకు వచ్చారు. కేక్ తీసుకొని అందరూ సంతోషంగా ఇంటికి వెళుతున్న సమయంలో రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో డిగ్రీ చదువుకునే అక్క మృతి చెందగా బర్త్‌డే జరుపుకోవాల్సిన తమ్ముడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ కృష్ణాపురానికి చెందిన అంకెబాబు దంపతులకు కుమార్తె మేఘన, కుమారుడు కార్తిక్ ఇద్దరు సంతానం. కొద్దినెలల క్రితం బాబు భార్య రమాదేవి మృతి చెందింది. పిల్లలు ఇద్దరు కర్ణాటక రాష్ట్రం రాయలపాడులోని అమ్మమ్మ వద్ద ఉంటూ చదవుకుంటున్నారు. పిల్లల పోషణ నిమిత్తం బాబు కువైట్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. మేఘన వాల్మీకిపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతోంది. తమ్ముడు కార్తిక్ జన్మదినం శుక్రవారం కావడంతో అమ్మమ్మ ఊరు రాయలపాడు నుంచి తమ స్వగ్రామం కృష్ణాపురానికి చేరుకున్నారు. శుక్రవారం రాత్రి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలని భావించి కేక్ కోసం ఆటోలో గుర్రంకొండకు వచ్చారు. రాత్రి కేక్ తీసుకొని ఆటోలో కృష్ణాపురం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో గుర్రంకొండ కోట వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మేఘన(18), కార్తిక్(14)కు గాయాలయ్యాయి. 108 వాహనంలో వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శనివారం పరిస్థితి విషమించి మదనపల్లె ఆస్పత్రిలో మేఘన మృతి చెందింది. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- ఇంట్లోనే రక్తపు మడుగులో పడి ఉన్న వైనం
- సన్నిహితంగా ఉన్న వ్యక్తిపై అనుమానం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు



సునీత (ఫైల్)



రక్తపు మడుగులో మృతి చెందిన మహిళ సునీత

మదనపల్లె : ఒంటరిగా జీవిస్తున్న మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శనివారం బయటపడింది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు.. మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ టేకులపాలెంకు చెందిన ఎర్రబెల్లి సునీత (45) చలపతి దంపతులు. చలపతి భవన నిర్మాణ కార్మిక మేస్త్రీగా పనిచేస్తుండగా, వీరికి కుమారుడు నాగేశ్వర(27), కుమార్తె మానస(29), ఉన్నారు. వీరికి వివాహాలు కాగా, కుమారుడు డ్రైవర్ గాను కుమార్తె బ్యూటీషియన్ గాను బెంగళూరులో స్థిరపడ్డారు. 10 సంవత్సరాల క్రితమే భర్త చలపతికి భార్య సునీత తన ఇష్టపూర్వకంగా రెండో వివాహం చేసింది. పుంగనూరు మండలం రాంపల్లిలో రెండవ భార్యతో కలిసి చలపతి నివాసం ఉంటున్నాడు. అనంతరం సునీత టేకుల పాలెం నుంచి మదనపల్లి మండలం, తట్టివారిపల్లి పంచాయతీలోని తిరుపతి రోడ్డు ఎర్రగానిమిట్ట బియస్ రెడ్డి కాలనీ సమీపంలో ఒంటరిగా నివసిస్తోంది. కుమారుడు, కుమార్తె తల్లి పోషణ నిమిత్తం ప్రతి నెల కొంత నగదు పంపేవారు. కొంతకాలం పాటు చిల్లర దుకాణం నిర్వహించి, ప్రస్తుతం మానేసింది. ఈ క్రమంలో ఒంటరిగా ఉంటున్న సునీతకు ఆమె సమీప బంధువైన కురబలకోట రైల్వే స్టేషన్ సమీపంలో నివాసం ఉన్న డ్రైవర్ లక్ష్మణప్ప అలియాస్ విజయ్ కుమార్ (46)తో సన్నిహిత సంబంధం ఏర్పడింది. సునీత వద్ద నుంచి అతను రూ. 50 వేలు నగదు తీసుకుని బదులుగా ఇంటి పత్రాలు ఆమె వద్ద ఉంచాడు. ఆ ఇంటి పత్రాలు ఇవ్వాల్సిందిగా సునీతను అడిగాడు. తీసుకున్న నగదు చెల్లిస్తే ఇంటి పత్రాలు ఇస్తానని సునీత చెప్పడంతో వారిద్దరి మధ్య వివాదం ఏర్పడింది. ఈనెల 3 తేదీన సునీత ఆఖరిసారుగా ఆమె చెల్లెలు అనిత, ఆమె కుమారుడు వంశీ, తల్లి రమణమ్మతో మాట్లాడింది. అదే రోజు నుంచి తిరిగి ఫోన్ చేస్తే ఎంతకీ సునీత వద్ద నుంచి సమాధానం రాలేదు. అయితే మూడో తేదీనే లక్ష్మణప్ప అలియాస్ విజయ్ కుమార్ తిరుపతికి వెళ్లాడు. సునీత బంధువులతో మాట్లాడాడు. శనివారం సునీత నివసిస్తున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు ఆమె కుటుంబ సభ్యులకు, తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ కళా వెంకటరమణ స్థానికులను అడిగి వివరాలు సేకరించారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పాటు మృతురాలు రక్తపు మడుగులో పడి ఉంది. మృతి చెంది మూడు రోజులు కావడంతో తీవ్రమైన దుర్వాసన వస్తున్న మృతదేహాన్ని సీఐ స్థానికుల సహాయంతో పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే సునీత కుటుంబ సభ్యులు, బంధువులు, ఆమెతో సన్నిహితంగా ఉన్న లక్ష్మణప్ప అలియాస్ విజయకుమార్‌పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తల్లి మృతిపై కుమార్తె మానస అనుమానం వ్యక్తం చేస్తూ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.